క్లుప్తంగా

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ నాగరాజ్

ఐరాల: సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధన చక్కని మార్గమని ఎంపీడీఓ ధనలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో ఆవరణలో బుధవారం యోగా మాస్టర్ ట్రైనర్ నాగరాజ్ ఆధ్వర్యంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని సచివాలయాల ఉద్యోగులకు ట్రైనర్లుగా రిజిస్ట్రేషన్ చేసి మూడు రోజుల పాటు యోగా మాస్టర్ ట్రైనర్ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జూన్ 21న ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో యోగా, ఆసనాల కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ దామోదర్‌నాయుడు పాల్గొన్నారు.

ప్రశాంతత కోసం యోగా

యాదమరి: నిత్యం యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుంది అని తహసీల్దార్ పార్థసారథి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం యోగాంధ్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరి జీవితంలో యోగా భాగం కావాలని చెప్పారు. ఎంపీడీవో వేణు మాట్లాడుతూ తప్పనిసరిగా రోజులో కనీసం 30 నిమిషాల యోగా కోసం కేటాయించాలని సూచించారు. శిక్షకుడు రామ్మూర్తి యోగాసనాలు వేసి చూపించారు.

విధుల్లోకి చిత్తూరు మునిసిపల్ కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ బుధవారం విధుల్లోకి చేరారు. గత వారం ఆయన ప్రయాణిస్తున్న కారు గాదంకి టోల్‌ప్లాజా వద్ద ప్రమాదానికి గురవడంతో, కారులో ఉన్న వాళ్లంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పది రోజుల వరకు సెలవుపై ఉన్న కమిషనర్, బుధవారం విధులకు హాజరై కార్యాలయంలో అధికారులతో పలు పనులపై సమీక్షించారు.

కిసాన్ డ్రోన్ మంజూరు

ఐరాల: మండలానికి కిసాన్ డ్రోన్ ఒకటి ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఏఓ వరలక్ష్మి తెలిపారు. స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి డ్రోన్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆ ఐదుగురిలో ఒకరిని డ్రోన్ పైలట్‌గా ఎంపిక చేసి ఉచితంగా శిక్షణ ఇస్తామని చెప్పారు. డ్రాగో కంపెనీ డ్రోన్ ధర రూ.9.5 లక్షలని, విహంగ కంపెని ధర రూ.9.81 లక్షలుగా ఉందని వివరించారు. 80 శాతం సబ్సిడీతో డ్రోన్ ఇస్తామన్నారు. ఆసక్తి గల రైతులు గ్రూపుగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఏఓ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు.

సూపర్ సిక్స్ పథకాల అమలెప్పుడు?



సమావేశంలో మాట్లాడుతున్న నాగరాజు

చిత్తూరు కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ ఎన్నికల్లో ప్రకటించిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. నగరంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన సూపర్‌సిక్స్ పథకాల అమలెప్పుడని ప్రశ్నించారు. నిరుద్యోగులకు నిరుద్యోగభృతి రూ.3,000 ఇవ్వాలని, ప్రతి ఇంట్లో చదువుకుంటున్న విద్యార్థులకు తల్లికి వందనం పేరుతో రూ.15 వేలు అందజేయాలన్నారు. పార్టీ సీనియర్ నాయకులు మణి, నాయకులు బాలాజీ రావు పాల్గొన్నారు.

దారి సమస్య పరిష్కరించాలని వినతి


తవణంపల్లె: దారి సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. మండలంలోని ముట్టుకూరు బీసీ కాలనీకి వెళ్లే దారిని రైతు ఫెన్సింగ్ వేసి దారిని ఆక్రమించుకున్నాడని ముట్టుకూరు బీసీ కాలనీ మహిళలు బుధవారం జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. దారి ఆక్రమణను తొలగించాలని కలెక్టర్ తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ మేరకు మహిళలు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం తవణంపల్లె సినిమా టాకీస్‌ను తనిఖీ చేశారు. ఆయనతో పాటు ఆర్ఐ జీవన్‌సాగర్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

మహానాడుపై ఉండే శ్రద్ధ ప్రాణాలపై లేదు

చిత్తూరు కార్పొరేషన్: పాలకులకు ప్రచారం పై ఉండే శ్రద్ధ చిన్నారుల ప్రాణాలపై లేదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ద్రాక్షయణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కడప గడ్డపై మహానాడు నిర్వహించడంపై సంతోషం వ్యక్తం చేసిన హోం మంత్రి అనిత అదే కడపలో మూడేళ్ల చిన్నారిని అత్యాచారం చేసి చంపేస్తే నిందితుడిపై చర్యలు ఎక్కడ అని ప్రశ్నించారు. రాష్ట్రంలో రోజూ ముగ్గురు మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయని అసెంబ్లీలో హోంమంత్రే చెప్పడం రాష్ట్ర దుస్థితికి అద్దం పడుతుందని చెప్పారు.

ఏడాదంతా నైరాశ్యమే

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు వెల్లివెరిశాయి. ఐదేళ్ల పాటు ఇంటింటా సంబరంలా సాగింది. పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆనందంగా గడిచింది. అమ్మ ఒడి పిల్లల నుంచి పండుటాకుల క్షేమాన్ని కోరుకుంది. తలుపుతట్టి సేవలను అందించింది. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి ప్రభుత్వ సేవలను ఇంటిముంగిటకే తీసుకొచ్చింది. వైద్య సేవలు సైతం పల్లెబాట పట్టేలా చేసింది. అయితే కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంటింటా కార్యక్రమాలు రోడ్డున పడ్డాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలను టార్గెట్ చేస్తూ సంక్షేమ పథకాలకు మంగళం పాడేసింది. ఈ ఏడాది కాలంలో పథకాలను మాయం చేసిన కూటమి సర్కారు పేద ప్రజలకు నైరాశ్యానికి గురి చేసింది.



వృద్ధురాలికి ఇంటి వద్దనే పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

- సకాలంలో దరికి చేరని సంక్షేమ పథకాలు
- గతంలో గడప దగ్గరకే వచ్చిన ప్రభుత్వ పాలన
- ప్రస్తుతం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

యాదమరి: కూటమి ప్రభుత్వ నాయకులు ఎన్నికల ప్రచార సభలలో ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ప్రగల్భాలు చెప్పారు. కూటమి సర్కారు పీఠమెక్కి దాదాపు ఏడాది కావస్తోంది. మరి ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలన్నీ గాలికొదిలేసిన కూటమి సర్కారు ప్రజలను నట్టేట ముంచేసింది. గత ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను రద్దు చేసింది. గత ప్రభుత్వ హయాంలో పేదలకు సంక్షేమాన్ని వలంటీర్ల ద్వారా అందిస్తూ నిరుద్యోగ సమస్యను పరిష్కరించారు. పేదలకు సంక్షేమ పథకాలన్నీ గడప వద్దకే అందిస్తూ ప్రజల వద్దకే సుపరిపాలన అందించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదంతా పేదలకు సామాజిక పింఛన్ మినహా ఏ పథకమూ అందలేదు. గతంలో ఆ పింఛన్ కూడా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటి వద్దనే అందించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. పంచాయతీ కార్యదర్శుల చేత పంపిణీ చేస్తుండడంతో పన్నుల చెల్లించలేదంటూ ఆ నగదును మినహాయించుకుంటున్నారు. పన్నులు చెల్లించినట్లు రశీదులు కూడా ఇవ్వడం లేదు.

ప్రజా పంపిణీ వ్యవస్థ అవినీతిలో కూరుకుపోయింది. గత ప్రభుత్వంలో ఇంటివద్దనే రేషన్ పథకంతో ఇంటింటికీ బియ్యం అందించారు. దీంతో అవినీతి మొత్తం జాడలేకుండా పోయింది. ఈ ప్రభుత్వం రాగానే మళ్లీ అవినీతి వ్యవస్థకు ఊపిరిపోసింది. ఇంటింటికీ రేషన్ పథకానికి మంగళం పాడింది.

ప్రజారోగ్య వ్యవస్థలో పట్టిన తుప్పును వదలగొట్టడానికి వైద్య వ్యవస్థలో గత ప్రభుత్వం పలు విప్లవాత్మక మార్పులను తీసుకువచ్చింది. ఆరోగ్యమే మహాభాగ్యం అని దాని నాడిని తెలిసిన గత ప్రభుత్వం దేశం గర్వపడేలా పేదల చెంతకు ఆరోగ్య సేవలను ఫ్యామిలీ డాక్టర్ పేరుతో గ్రామాల్లోకి సర్కారు వైద్యం తీసుకువచ్చింది. అయితే గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందనే కారణంతో కూటమి సర్కారు దీన్ని రూపుమాపేందుకు ప్రయత్నిస్తోంది. ఎక్కడ రైతులు సంతోషంగా ఉంటారో అక్కడ అభివృద్ధి పరుగులు పెడుతుందని గుర్తించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలకు పునాది వేసింది. వాటి ద్వారా సాగుకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు, యంత్రసామగ్రి గ్రామంలోనే సమకూర్చింది. అయితే కూటమి సర్కారు వీటికి పేరు మార్చి నిర్వీర్యం చేసేందుకు కంకణం కట్టుకుంది.

ప్రజల వద్దకే పాలన అన్న నినాదంతో గత ప్రభుత్వంలో ఏ పథకమైన ఇంటి వద్దకే వచ్చి తలుపుతట్టింది. అధికారులకు, నాయకులు లంచాలు ఇవ్వకుండా సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కింది. అయితే కూటమి సర్కారు గడెనెక్కగానే మళ్లీ ప్రజలను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పించుకునేందుకు చర్యలు చేపట్టింది. కనీసం ఉన్నత విద్యకు అవసరమైన సర్టిఫికెట్ల తీసుకోవడానికి విద్యార్థులు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎన్నికల ముందు కూటమి నాయకుల మాటలు నమ్మినందుకు ఇప్పుడు అనుభవిస్తున్నామంటూ పేద ప్రజలు గుండెలు బాదుకుంటున్నారు. కొత్త పథకాలు ఇవ్వకపోగా ఉన్న పథకాలు ఎత్తేస్తూ తమ కడుపుకొడుతున్నారంటూ గగ్గోలు పెడుతున్నారు.



వైకల్య నిర్ధారణ సర్టిఫికెట్ కోసం ఆస్పత్రి వద్ద నిరీక్షిస్తున్న దివ్యాంగ పింఛనుదారులు

కానరాని అన్నదాత సుఖీభవ



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాదిగా వస్తున్న రైతన్నలకు అన్నదాత సుఖీభవ పథకం నిధులు అందలేదు. సన్న చిన్న కారు రైతులను ఆదుకుంటామని, అర్హులైన రైతులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున నగదు అందజేస్తామని చెప్పారు. ఏడాదితున్న ఇంతవరకు రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు జమ కాలేదు.

– పాలాక్షి రెడ్డి, రైతు సంఘ నాయకులు, బంగారుపాళెం

కష్టాలు మళ్లీ మొదలు



ప్రభుత్వ పథకాలకు ప్రజలకు మధ్య వారధిలా వ్యవహరించిన ప్రభుత్వ సేవకులైన వలంటీర్ వ్యవస్థ రద్దుతో ప్రతి ఒక్క పనికీ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. వలంటీర్లు ఉన్నప్పుడు ప్రభుత్వం నుంచి ఏమి కావాలన్నా గడప దగ్గరకే వచ్చి అందించేవారు. ఈ ప్రభుత్వం గద్దె దిగితే తిరుమలకు వెళ్లి గుండు కొట్టించుకుంటాను.

–రాజేంద్ర, యాదమరి

రేషన్ ఇంటింటికీ అందడం లేదు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎండీయూ ద్వారా వాహనంలో వచ్చి ఇంటింటికి రేషన్ బియ్యం ఇచ్చారు. తూకంలో కూడా మోసాలు లేకుండా సరుకులన్నీ అందించారు. ఈ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత వాహనాలు క్రమంగా ఆగిపోయాయి. డీలర్ దగ్గరకు వెళ్లాల్సి వస్తోంది. అక్కడకి వృద్ధులు, దివ్యాంగులు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది.

–వందుసాహెబ్, పొన్నేదుపల్లె, తవణంపల్లె

కంటి తుడుపుగా పథకాలు



కూటమి ప్రభుత్వంలో పథకాలన్నీ కంటి తుడుపుగా ఇస్తున్నారు. అదే వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఇంటికి వచ్చి ఏ పథకం కింద అర్హత ఉందో అన్నీ చూసే ఇచ్చేవారు. ఇప్పుడు పథకాలు లేవు. ఏమి కావాలన్నా ప్రస్తుతం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది.

– రామచంద్రారెడ్డి, ఎగువ తవణంపల్లె

తల్లికి వందనం ఎప్పుడో ?



గత ప్రభుత్వ హయాంలో పాఠశాలలు ప్రారంభంగానే అమ్మ ఒడి పథకం కింద రూ.14000 తల్లుల ఖాతాలో జమయ్యేది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్న తల్లికి వందనం పథకం ఊసేఎత్త లేదు. మరో పది రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఈ పథకం అమలు చేస్తారో లేదో ఆదోళనంగా ఉంది.

– రోజా, వడ్డిపల్లె, ఐరాల

కాణిపాకంలో వైభవంగా మహాకుంభాభిషేకం



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న అధికారులు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన ఆవరణలోని శ్రీవీరాంజనేయస్వామి మహాకుంభాభిషేకం వైభవంగా సాగుతోంది. కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, విష్ణు పంచ సుక్త సహిత మన్యుసూహోమం, సీతా లక్ష్మణ హనుమంత సమేత శ్రీ రామచంద్రం మూల మంత్ర హవనం తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకుముందు కలశాల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో పెంచల కిషోర్, దాత అనిల్ కుమార్ కుటుంబ సభ్యులు, దేవస్థానం మాజీ చైర్మన్ మోహన్ రెడ్డి, అర్చకులు, వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ధ్వజారోహణం

యాదమరి: మండల కేంద్రంలోని శ్రీ పెరుందేవి సమేత శ్రీ వరదరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో వేడుకగా ప్రారంభమయ్యాయి. వైఖానస ఆగమ శాస్త్రం ప్రకారం వేద పారాయణాలతో వేద పండితుల మంత్రోపచారాలతో బ్రహ్మోత్సవ క్రతువు ప్రారంభించారు. అనంతరం రాత్రి అంగరంగ వైభవంగా భక్తుల కోలాహలం నడుమ ఇంద్రవరద స్వామి చంద్ర వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ప్రశాంత్ నగర్‌లో కాలువలు ఏర్పాటు చేయాలి



సమైక్యతా ర్యాలీ చేస్తున్న సీపీఎం నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: కలెక్టరేట్‌కు కూత దూరంలో ఉన్న ప్రశాంత్ నగర్‌లో కాలువలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు తెలిపారు. ఆ ప్రాంతంలో బుధవారం సమైక్యతా యాత్రను నిర్వహించి మాట్లాడారు. ప్రశాంత్‌నగర్‌లోని పలు ప్రాంతాల్లో కాలువలు లేకపోవడంతో మురుగునీరు నివాసాల ఎదుట ప్రవహిస్తోందన్నారు. ఆ ప్రాంతంలో దోమలు చేరి అంటురోగాలు ప్రబలుతున్నాయని చెప్పారు. ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని వెంటనే రోడ్డు, కాలువలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు ప్రియాంక, కళ, సెల్వి, చిత్ర. సందీప్ పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్సు



శ్రీరంగరాజపురం: మండల పరిధిలోని తయ్యూరు పాయికట్టు అంకనపల్లి వద్ద జరుగుతున్నా శ్రీద్రౌపదీదేవీ సమేత ధర్మరాజుల వారి మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన అర్జున తపస్సు భక్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అర్జున తపస్సుమాను వద్దకు చేరుకున్న అర్జున వేషధారి, తపస్సు ఘట్టానికి సంబంధించిన పద్యాలను ఆలపిస్తూ అధిరోహించారు. విభూధి, నిమ్మ పండ్లను కిందకు విసరగా వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. సంతానం లేని మహిళలు తపస్సుమాను కింద వరపడ్డారు.

పాల ఉత్పత్తిదారుల సంస్థ శ్రీజ



మహిళలకు ఉచితంగా అందజేస్తున్న మినరల్ మిక్చర్,వాటర్, హార్లిక్స్ ఉమెన్స్

గుడిపాల: పాల ఉత్పత్తిదారుల సంస్థ శ్రీజ డెయిరీ అని ఆ డెయిరీ ఏరియా మేనేజర్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బొమ్మసముద్రం పాలశీతలీకరణ కేంద్రం వద్ద బుధవారం విలేజ్ కాంటాక్ట్, మెంబర్ రిలేషన్స్‌పై మహిళా సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీజ పదేళ్లుగా పాలసేకరణ మహిళా సభ్యుల ద్వారా ఈ రోజు వరకు 7లక్షల పైచిలుకు పాలను శ్రీజ గ్రామ స్థాయి నుంచి సేకరిస్తుందని తెలిపారు. పాలను ప్రాసెసింగ్ తరువాత మదర్ డెయిరీ సహకారంతో మార్కెటింగ్‌లో పాలు, పాల పదార్థాలుగా వినియోగదారులకు అందుబాటులో ఉంటున్నాయని చెప్పారు. అనంతరం ఏరియా ప్రొడ్యూసర్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫీసర్ నాగభూషణ్ యాదవ్ మాట్లాడుతూ శ్రీజ డెయిరీలో మహిళా సభ్యులకు జరుగుతున్న విషయాలను చెప్పడం, వారి సమస్యలను శ్రీజ డెయిరీ సిబ్బంది వరకు తీసుకురావలసిన బాధ్యతలను వివరించినట్లు చెప్పారు. శిక్షణలో పాల్గొన్న మహిళలు 53మందికి శ్రీజ మిల్టన్ వాటర్‌బాటిల్, ఆవులకు మినరల్ మిక్చర్, హార్లిక్స్ ఉమెన్స్ ప్లస్‌ను ఉచితంగా అందజేశారు. కార్యక్ర మంలో ఏరియా సూపర్‌వైజర్ రమేష్, లవకుమార్ పాల్గొన్నారు.

అందరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలి



బాలికలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రష్మిత

గుడిపాల: వ్యక్తిగత శుభ్రత ప్రతి ఒక్కరూ పాటించాలని బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత అన్నారు. కిశోర బాలికలకు బుధవారం మహిళ రుతుక్రమం– ఆరోగ్య పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కిశోర బాలికలకు నెలసరిలో వచ్చే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాలికల ఆరోగ్య ఎదుగుదల కోసం ఐరన్, ప్రొటీన్లతో కూడిన ఆకుకూరలు, సమతులాహారం తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో తిరుగుతూ రుతుక్రమం సమయంలో మహిళల్లో సంభవించే ఆరోగ్య సమస్యలు వాటి పరిష్కారంపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వేసవి శిబిరం.. పుస్తక పఠనం



ఐరాల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం, పాడుపు కథలు, జీకే, గణితం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి సుజాత మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటాపాటలతో, సృజనాత్మకతను వెలికి తీసేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు. - ఐరాల

పాలేటమ్మ నిమజ్జనోత్సవం



నిమజ్జనానికి బయల్దేరిన పాలేటమ్మ అమ్మవారు

ఐరాల: మండల కేంద్రంలో పాలేటమ్మ గంగజాతర నిమజ్జనోత్సవం బుధవారం ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు గంగజాతర వైభంగా సాగింది. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అమ్మవారికి బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యం సమర్పించారు. రాత్రి ప్రత్యేక మండపంలో కొలువుదీరిన నడివీధి గంగమ్మకు సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించి వాహనంపై కొలువుదీర్చారు. ప్రత్యేక డప్పు వాయిద్యాలు, మంగళవాయిద్యాలు, మేళతాళాలు, బాణాసంచా నడుమ బజారువీధి మీదుగా ఊరేగించారు. భక్తులు ప్రతి ఇంటి వద్ద పసుపు నీళ్ల పోసి, కొబ్బరి కాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సమీపంలోని కుంటలో అమ్మవారి నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు.

ఎన్టీ రామారావు సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : దివంగత మాజీ సీఎం నందమూరి తారకరామారావు సేవలు చిరస్మరణీయమని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ 102 జయంతి వేడుకలును అధికారికంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎన్టీఆర్ చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డీఆర్‌వో మోహన్‌కుమార్, ఏవో కులశేఖర్, సీపీవో సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

నివాళులర్పించిన పోలీసుశాఖ

చిత్తూరు అర్బన్: నందమూరి తారకరామారావు జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసుశాఖ ఆయనకు నివాళులర్పించింది. ఎన్టీఆర్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించడంతో బుధవారం చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆర్ముడు రిజర్వు ఏఎస్పీ శివానంద కిషోర్, ఆర్ఐ చంద్రశేఖర్, సుధాకర్‌తోపాటు పోలీసు సంక్షేమ సంఘ నాయకులు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ట్రాన్స్‌కో కార్యాలయంలో..

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో జిల్లా ఎస్ఈ కార్యాలయంలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ 102వ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ప్రభుత్వ ఉద్యోగి స్థాయి నుంచి సీఎంగా ఎదిగారని, ఆయన ప్రవేశపెట్టిన పథకాలను, పాలన గురించి ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలియజేశారు. కార్యక్రమంలో ఈఈలు మునిచంద్ర, సురేష్, జగదీష్, పీఓ రెడ్డెప్ప, ఏఈ వివేకానందరెడ్డి పాల్గొన్నారు.